కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకే..

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల/ రాయికల్, నవంబర్ 11 : అబద్ధపు హామీలతో రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకే కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జగిత్యాలలో జగిత్యాల పట్టణ, రూరల్, అర్బన్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు, ప్రజాప్రతినిధులతో.. రాయికల్‌లో అక్కడి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఈ పరిస్థితుల్లో రైతులకు బాసటగా నిలిచేందుకు పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. అబద్ధపు హామీలతో రైతులను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మాట్లాడుతున్న దావ వసంత



హామీల దగాపై రైతన్న పోరుబాట

కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు లాంగ్‌మార్చ్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నేతృత్వంలో కోరుట్ల నుంచి జగిత్యాల వరకు పాదయాత్ర
- చల్‌గల్ వద్ద సంఘీభావం తెలుపనున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- పాదయాత్రకు తరలిరానున్న రైతులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

జగిత్యాల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ రైతులకు అనేక హామీలు ఇచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు ఏటా ₹10 వేల పెట్టుబడి సాయం ఇస్తే, రైతు భరోసా పేరిట ₹15 వేలు చెల్లిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. రైతుకూలీలకు సైతం ఏడాదికి ₹12 వేల సాయం అందిస్తామన్నది. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అటకెక్కించింది. గత ప్రభుత్వంలో అమలైన పథకాలను కూడా అమలు చేయకపోగా, ఇస్తామన్న రైతు భరోసా సాయాన్ని వానకాలం పంటకు ఎగవేసింది. పంట సాగు చేసే భూమికే ఇస్తామంటూ.. పదెకరాలలోపు వారికే ఇస్తామంటూ కాలం గడిపి చివరకు చేతులు దులుపుకొన్నది. మరో వైపు రైతు కూలీలకు సాయం చేయకపోగా, కనీసం వారిని గుర్తించే కార్యక్రమం కూడా చేపట్ట లేదు. తాజాగా, యాసంగి సీజన్ మొదలైనా ఇంత వరకు రైతు భరోసా ఊసే లేదు. ఈ సీజన్‌కైనా ఇస్తుందా.. లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్వాకం వల్ల వానకాలం సీజన్‌లో ఒక్క జగిత్యాల జిల్లాకే ₹300 కోట్లు రాకుండా పోయాయి. అలాగే, ఈ యాసంగికి సంబంధించి ₹220 కోట్లు వచ్చే విషయంలో సందిగ్ధత ఏర్పడ్డ నేపథ్యంలో రైతాంగం తీవ్ర ఆవేదన, ఆగ్రహంతో ఉన్నది.

60 శాతం దాటని రుణమాఫీ

₹2 లక్షలలోపు రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రహసనంలా మారిపోయింది. జగిత్యాల జిల్లాలో దాదాపు 60 శాతానికి మించలేదు. ప్రభుత్వం పెట్టిన నిర్దేశిత సమయం వరకు జిల్లాలోని 1,38,142 మంది రైతులు పంట రుణం తీసుకున్నారు. జూలై నుంచి మూడు దఫాల్లో కేవలం 72,116 మంది రైతులకు ₹568.33 కోట్ల రుణాలను మాత్రమే మాఫీ చేసింది. ఇంకా 66,026 మందికి మాఫీ జరగాల్సి ఉన్నది. దీంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ, చివరకు ప్రజావాణిలో కలెక్టర్ వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చి తమకు న్యాయం చేయాలని వేడుకొని విసిగిపోయారు. రాయికల్ మండలం మైతాపూర్, మల్లాపూర్ మండలం రాఘవపేట, గొర్రెపల్లి, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, వెల్లుల, కోరుట్ల మండలం జోగినిపెల్లి గ్రామాల్లో తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. రుణమాఫీ కాని వారు రంది పడవద్దని, అందరికీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడంతోపాటు వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని, హెల్ప్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పింది. రైతులను తిప్పితిప్పి చివరికి మొండిచేయి చూపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోరాటాల పురిటి గడ్డ, రైతు చైతన్య వేదిక అయిన జగిత్యాల జిల్లాలో రైతులు మరోసారి పోరుబాట పడుతున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, వరికి బోనస్‌పై కాంగ్రెస్ సర్కారు చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం, కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అటకెక్కించడాన్ని నిరసిస్తూ నేడు కోరుట్ల నుంచి జగిత్యాల వరకు లాంగ్‌మార్చ్ చేయడానికి సిద్ధమయ్యారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నేతృత్వంలో చేపట్టే ఈ పాదయాత్రలో రైతులు, రైతు కూలీలు, రైతు నాయకులతోపాటు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

ధాన్యం కొనే దిక్కేది

ఎన్నికలకు ముందు వరికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే, యాసంగి పంట కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పట్టించుకోకపోగా, బోనస్ ఇవ్వలేదు. దీంతో అప్పుడే రైతులు నిరసన తెలిపారు. అయితే, వానకాలం వేసిన వరికి బోనస్ వస్తుందన్న ఉద్దేశంతో ఒక్క జగిత్యాల జిల్లాలోనే దాదాపు 3.31 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే, వానకాలం పంట ఆరంభమైన రెండు నెలల తర్వాత సన్నరకాలకు మాత్రమే మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని సర్కారు ప్రకటించడంతో తీవ్ర నిరాశ చెందారు. ప్రభుత్వం తమను పూర్తిగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కేవలం 85 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకాలు వేయగా, దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో దొడ్డురకాలు సాగు చేశారు. దీంతో మెజార్టీ రైతులకు బోనస్ అందని పరిస్థితి ఏర్పడింది. సన్నాలకు మాత్రమే బోనస్ ఇవ్వడం ఏంటని, ఇప్పటికే సన్నాలకు బహిరంగ మార్కెట్‌లో ₹3 వేల నుంచి ₹3,100 వరకు పలుకుతున్నదని, ఈ ధరలతో చాలా మంది రైతులు నాలుగైదు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొనే సాగు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే రాయితీ ఎందుకూ పనికి రాదని వారు మండిపడుతున్నారు. దీనికి తోడు సన్నరకం బియ్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం గింజల పరిమాణాన్ని లెక్కించే పద్ధతిని తీసుకురావడంపై ఆగ్రహిస్తున్నారు. వరికి బోనస్ సంగతి దేవుడెరుగు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేదని మండిపడుతున్నారు. దాదాపు పదిహేను రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలు పోసినా కొనే వారు లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు పాదయాత్ర

ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, విద్యుత్ కోతలు, ఎరువుల ధరల పెంపు, విత్తనాల కొరత, తదితర సమస్యలతో జగిత్యాల జిల్లా రైతులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పోరుబాటకు సమాయత్తమయ్యారు. జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టికి తీసుకువచ్చేందుకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సిద్ధమయ్యారు. రైతులతో కలిసి నేడు కోరుట్ల నుంచి 'రైతు పోరాట పాదయాత్ర' చేపడుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్ర వెంకటాపూర్, మేడిపల్లి, తాటిపెల్లి, చల్‌గల్ మీదుగా జగిత్యాలకు చేరుకోనున్నది. చల్‌గల్ సమీపంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి, అక్కడి నుంచి జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నారు. పాదయాత్రలో రైతులతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు పాల్గొననున్నారు. కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవి శంకర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొననున్నారు.

మోసాలను ఎండగట్టేందుకే యాత్ర

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇది రాజకీయ యాత్ర కాదని, రైతులు ఎదుర్కొంటున్న వ్యథలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపడుతున్న రైతు వేదన యాత్ర అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు ఈ పాదయాత్ర చేపట్టానని స్పష్టం చేశారు. యువకులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పాదయాత్రపై తన అభిప్రాయాలను 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సమస్యలు పెరిగిపోయాయని, గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు క్రమంగా కనుమరుగయ్యాయని, దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం గత వానకాలం పంటకు రైతు భరోసా ఎగవేసిందని, జిల్లాలో దాదాపు 4 లక్షల ఎకరాల భూమికి పంట సాయం అందకుండా పోయిందని మండిపడ్డారు. రుణమాఫీ కూడా జిల్లాలో 60 శాతం మందికి కూడా జరగలేదని, న్యాయం చేయాలని రైతులు కోరితే పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారని వాపోయారు. అష్టకష్టాలు పడి పంటలు పండిస్తే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేదని, రైతులు విధి లేని పరిస్థితిలో ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన చెందారు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిందని, ఇప్పుడు వానకాలం పంట అమ్మే పరిస్థితి వచ్చినా ఆ సంగతి తేల్చడం లేదని ఆగ్రహించారు. ప్రభుత్వ తీరుతో రైతులందరు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. రైతులు పడుతున్న ఆవేదనలోంచి వచ్చిందే ఈ పాదయాత్ర అని, నేటి ఉదయం 8 గంటలకు కోరుట్ల నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, నవంబర్11: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కోరుట్ల నుంచి జగిత్యాల వరకు నేడు చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ యాత్రలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని, చొప్పదండి నియోజకవర్గం నుంచి రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన చొప్పదండిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా చేయలేదని, రైతుభరోసా వేయలేదని, వడ్లకు ₹500బోనస్ ఇస్తామని మోసం చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విజయవంతంగా అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కు తీసుకొంటున్నారని మండిపడ్డారు. అంతకు ముందు పలు గ్రామాల్లో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాచర్ల వినయ్‌కుమార్, బందారపు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొర్రీలు పెడుతున్నది. ఇప్పటికీ నిబంధనల ప్రకారం పత్తి రావడం లేదని పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేయకుండా చోద్యం చూస్తున్నది. అంతేకాకుండా, నోటిఫై చేసిన మిల్లులపై ఆంక్షలు విధిస్తున్నది. పైగా రోజురోజుకూ నిబంధనలు కఠినతరం చేయడంతో చివరకు కొనుగోళ్లు చేయలేమని సోమవారం జిన్నింగ్ మిల్లర్లు చేతులెత్తేశారు. విషయం తెలియకుండా మిల్లులకు పత్తితో వచ్చిన రైతులు, పొద్దంతా పడిగాపులుగాశారు. వీరి బాధలు చూడలేక మధ్యాహ్నం తర్వాత ఒక్క ఎలబోతారంలో కొనుగోలు చేసినా.. మిగతా చోట్ల కొనకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు మిల్లర్లు, సీసీఐ అధికారుల మధ్య సయోధ్య కుదరడంతో మంగళవారం నుంచి కొనుగోళ్లు పునఃప్రారంభమవుతాయని అధికారులు చెప్పారు. అయితే, ఇప్పటి వరకు కొనుగోళ్లలో ప్రైవేట్ వ్యాపారులదే పైచేయి కాగా, కనీస మద్దతు ధర దక్కక రైతులు పెద్ద మొత్తంలో నష్టపోయారు. ఇప్పటికైనా సీసీఐ చొరవ చూపి మద్దతు ధరతో కొనేలా చూడాలని కోరుతున్నారు.

ఎలబోతారంలోని ఓ మిల్లు ఎదుట నిలిచిన పత్తి వాహనాలు

- కొనుగోళ్లలో సీసీఐ కొర్రీలు
- ఒక మిల్లు తర్వాత మరో మిల్లులో కొనాలని ఆంక్షలు
- చేతులెత్తేసిన జిన్నింగ్ మిల్లర్లు
- నిలిచిపోయిన కొనుగోళ్లు
- మిల్లుల వద్ద రైతుల పడిగాపులు
- సీసీఐ, వ్యాపారుల మధ్య సయోధ్య
- నేటి నుంచి మళ్లీ కొనుగోళ్లు
- ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లాలో సీసీఐ కొన్నది 3,048 క్వింటాళ్లే
- ప్రైవేట్ వ్యాపారులు కొన్నది 24,768 క్వింటాళ్లు
- మద్దతు ధర రాక నష్టపోతున్న రైతులు

కరీంనగర్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ రూరల్ : కరీంనగర్ జిల్లాలో గత వానకాలం సీజన్‌లో 42,730 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ లెక్కన 3,84,570 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఎప్పటిలాగే జిల్లాలోని జమ్మికుంటలో 7, కరీంనగర్‌లో 3, చొప్పదండి, గంగాధర మార్కెట్ల పరిధిలో ఒక్కొటి చొప్పున మొత్తం 12 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసింది. సీసీఐ నిబంధనల ప్రకారం అన్ని కేంద్రాల్లో ఒకేసారి కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉన్నది. కానీ, ఇప్పటి వరకు కేవలం మూడు కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరిపింది. ఎన్నడూ లేని విధంగా సీసీఐ అధికారులు కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చారు. మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట విడదీశారు. ఎల్-1 పరిధిలో ఉన్న మిల్లుల్లోనే ముందుగా కొనుగోళ్లు జరపాలని, మిగతా కేంద్రాలు మూసివేయాలని ఆంక్షలు విధించారు. నిజానికి జిన్నింగ్ కోసం మిల్లర్ల నుంచి ముందుగా సీసీఐ అధికారులు టెండర్లు పిలుస్తారు. ఎప్పటిలాగే ఈసారి టెండర్లు పిలిచినప్పుడు మిల్లర్లు ₹1,450 నుంచి ₹1,520కి ఒక బేలు చుట్టేందుకు టెండర్లు వేశారు. వీటిని పరిశీలించిన సీసీఐ అధికారులు ₹1,345 మాత్రమే ఇస్తామని స్పష్టం చేయడంతో అంగీకరించారు. అయితే ఈ నిబంధనలు అమలులో ఉండగానే కొత్తగా ఎల్-1, ఎల్-2,ఎల్-3 ఎందుకు తేవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. కొత్త నిబంధనల ప్రకారం ఎల్-1 మిల్లులు తమకు సరిపడా పత్తి కొన్న తర్వాత ఎల్-2, ఎల్-3 మిల్లులు దశల వారీగా కొనుగోళ్లు జరపాల్సి ఉండగా, దీనిని మూకుమ్మడిగా వ్యతిరేకించారు. అన్ని మిల్లుల్లో ఒకేసారి కొనేందుకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. జిల్లా మార్కెట్ అధికారులు కూడా పది రోజుల కిందనే సీసీఐ అధికారులకు ఒక లేఖ కూడా రాశారు. కానీ, సీసీఐ దిగి రాకపోవడంతో సోమవారం కొనుగోళ్లు నిలిపేశారు.

రైతులపై భారం

సీసీఐ నిబంధనల ప్రకారం చూస్తే రైతులపైనా భారం ఉండనున్నది. ఉదాహరణకు గంగాధర మార్కెట్ పరిధిలోని రైతులకు రామడుగు మండలం గోపాల్‌రావుపేట మార్కెట్ యార్డు పరిధిలోని వెలిచాలలోని ఓ జిన్నింగ్ మిల్లులో విక్రయించుకోవాల్సి ఉంటుంది. ఈ మిల్లు ఎల్-1 పరిధిలో లేకుంటే సీసీఐ చెప్పేంత వరకు కొనలేరు. కరీంనగర్ మార్కెట్ పరిధిలోని రేణికుంటకు వెళ్లి విక్రయించుకోవాలని సీసీఐ అధికారులు చెబుతున్నారు. అయితే రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల రైతులు రేణికుంటకు వెళ్లి విక్రయించాలంటే రవాణా చార్జీలు భరించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే సీసీఐ అధికారుల నిబంధనలు ఇటు రైతులకు, అటు మిల్లర్లకు శరాఘాతంగా మారాయి. సోమవారం కొనుగోళ్లు నిలిపివేయడంతో రాష్ట్ర స్థాయిలో చర్చలు జరిపిన తర్వాత మంగళవారం నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభిస్తామని, ఎల్-1 నుంచి ఎల్-3 నిబంధనలకు సీసీఐ సడలించిందని, రైతులు తమ పత్తిని ఎక్కడి మిల్లులోనైనా విక్రయించుకునే అవకాశం కల్పించిందని మిల్లర్లు చెబుతున్నారు.

పొద్దంతా పడిగాపులు

సీసీఐ అధికారుల ఆంక్షల నేపథ్యంలో సోమవారం పత్తి మిల్లుల్లో కొనుగోళ్లు నిలిపి వేశారు. మార్కెటింగ్ అధికారులు కూడా సెలవు ప్రకటించారు. ఈ విషయం తెలియని రైతులు పత్తితో మిల్లుల వద్దకు వెళ్లారు. జిల్లాలోని దాదాపు అన్ని మిల్లుల వద్ద రైతులు పత్తి వాహనాలతో వచ్చి గేట్ల వద్దనే పడిగాపులుగాశారు. తిండీ తిప్పలు లేక మిల్లుల వద్దనే గంటల తరబడి నిరీక్షించారు. ఒక పక్క సీసీఐ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతున్నదని, కొనుగోళ్లు జరుపుతామని మిల్లర్లు రైతులకు చెప్పుకొంటూ వచ్చారు. తెల్లవారు జామున వచ్చిన రైతులు గంటల తరబడి ఉన్నా మిల్లులు తెరుచుకోకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరిగారు. తిరిగి వెళ్లి మళ్లీ వచ్చి విక్రయిస్తే అదనంగా రవాణా చార్జీలు భరించాల్సి వస్తుందని చాలా మంది రైతులు సాయంత్రం వరకు వేచి ఉండి పత్తి విక్రయించుకుని వెళ్లారు. సీసీఐకి మిల్లర్లకు మధ్య సయోధ్య కుదరడంతో మంగళవారం నుంచి యధావిధిగా కొనుగోళ్లు జరుగుతాయని మార్కెటింగ్ శాఖ ఏడీఎం ప్రకాశ్ తెలిపారు.

సీసీఐ కొన్నది నామ మాత్రమే..

సీసీఐ అధికారులపై ఒత్తిడి తెచ్చి రైతుల నుంచి సక్రమంగా కొనుగోళ్లు జరిపించే బాధ్యత సర్కారుది. కానీ, పర్యవేక్షణ కరువై 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. సీసీఐ నిబంధనల ప్రకారం ఉన్న పత్తిని కూడా తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తున్నది. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు ₹7,521 ఉండగా, వ్యాపారులు మాత్రం ₹6,600 నుంచి ₹6,800 వరకు చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఇప్పటికీ 30 శాతం తేమ వస్తున్నదని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో తేమ వస్తే వ్యాపారులు ఎలా కొంటారనేది వాళ్లకే తెలియాలి. కాగా, కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్లను పరిశీలిస్తే సీసీఐ కొన్నది నామమాత్రమనే తెలుస్తున్నది. కరీంనగర్ మార్కెట్ పరిధిలో సీసీఐ 667 క్వింటాళ్లు కొంటే వ్యాపారులు 400 క్వింటాళ్లు కొన్నారు. జమ్మికుంటలో 1,247 క్వింటాళ్లు సీసీఐ కొంటే, 24,215 క్వింటాళ్లు ప్రైవేట్ వ్యాపారులు కొన్నారు. చొప్పదండిలో 204 క్వింటాళ్లు సీసీఐ కొంటే, 153 క్వింటాళ్లు ప్రైవేట్ వ్యాపారులు కొన్నారు. ఒక్క గోపాల్‌రావుపేట మార్కెట్ యార్డు పరిధిలో మాత్రం సీసీఐ మాత్రమే 930 క్వింటాళ్లు కొన్నది. మొత్తంగా చూస్తే సీసీఐ కేంద్రాల్లో కేవలం 3,048 క్వింటాళ్లు కొంటే, 24,768 క్వింటాళ్లు ప్రైవేట్ వ్యాపారులే కొన్నారు. మున్ముందు భారీ కొనుగోళ్లు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోక తప్పదనేది స్పష్టంగా కనిపిస్తున్నది.

తెల్లారంగ వచ్చినం

ఇయ్యాళ పత్తి కొంటలేరనే సంగతి నాకు తెల్వక తెల్లారంగానే వచ్చిన. కొద్దిగనేకదా జెల్దీ అమ్ముకుని ఇంటికి పోదమని నోట్లె మంచి నీళ్లు సుతం పొయ్యకుంట వచ్చిన. మీటింగ్ అయిపోయినంక మూడు గంటలకు గేట్లు తీసిన్రు. సీసీఐ అధికారులు అడ్డగోలు నిబంధనలు పెడితే మేం ఎక్కడికి వెళ్లి అమ్ముకోవాలె. మాది చామన్‌పల్లి మాకు ఎలబోతారం మిల్లు దగ్గరుంటది. రేణికుంటకుపోయి అమ్ముకోవాల్నంటే ఎట్ల పోతం.

- బోడగొండ తిరుపతి, చామన్‌పల్లి (కరీంనగర్)

పత్తి పండిచ్చుడే తప్పయితంది

పత్తి పండిచ్చుడే తప్పయితంది. తేమ ఎక్కువ ఉన్నదని నిన్నామొన్నటిదాకా కొనలేదు. ఇప్పుడు కొంటమని చెప్పి మళ్లీ ఒక్క మిల్లుకే ఇచ్చిండ్రట. మాది చొప్పదండి మండలం వెదురుగట్ట. మేమెప్పుడు ఎలబోతారంలనే అమ్ముతం. ఇక్కడికి రావాల్నంటే ఆటోకైతే వెయ్యి రూపాయలైతన్నయి. సీసీఐ అధికారులు చెప్పినట్టు రేణికుంటకు పోవల్నంటే మూడు వేలన్న అయితయి. నేను తెచ్చింది నాలుగైదు కింటాళ్లు. దీనికచ్చే పైసల నుంచి మూడు వేలు పోయినంక నాకేం మిగులుతయి. అందుకే ఎక్కడి పత్తి అక్కన్నే అమ్ముకునేతట్టు చెయ్యాలె.

- ఇరుగురాళ్ల మునీందర్, వెదురుగట్ట (చొప్పదండి)

మూడు క్వింటాళ్ల పత్తికి 30 కిలోమీటర్లు పోవాల్నా



మాది చామన్ పల్లి. నేను మూడు క్వింటాళ్ల పత్తిని ఎలబోతారం తెచ్చిన. ఇక్కడైతే దగ్గరుంటది. అమ్ముకొని ఇంటికి పోవచ్చు. కానీ, సీసీఐ అధికారులు చెప్పినట్టు అమ్మాలంటే నేను రేణికుంటకు పోవాల్సి వస్తది. ఈ ముత్తెమంత పత్తి అమ్మతానికి 30 కిలో మీటర్ల దూరం పోవల్నా? ఇసొంటి అధికారులను ఎక్కడ చూడలే. ఎక్కడి రైతులు అక్కడ అమ్ముకుంటే మంచిదా..? ఇక్కడి రైతులు పోయి అక్కడ, అక్కడి రైతులచ్చి ఇక్కడ అమ్మితే మంచిదా.. సీసీఐ కొనది కొనెటోళ్లను కొననియ్యది అన్నట్లయ్యింది. మంచి పత్తి ఉంటె కూడా కొంటలేరు. 8 శాతం తేమ ఉన్న పత్తికి సుతం వంకలు పెడుతున్నరు. రైతులు విసిగిపోతున్నరు. మునుపటి లెక్క పట్టించుకునెటోళ్లు లెకుంటయ్యిండ్రు.

- మెరుగు రమేశ్, చామన్‌పల్లి (కరీంనగర్)

అమర్-స్రవంతి దంపతుల పిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

మాట నిలుపుకొన్న రామన్న

- ఆత్మహత్య చేసుకున్న నేతకార్మిక దంపతుల పిల్లల పేరిట ₹6లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్
- ఇంటికెళ్లి బాండ్లు అందజేసిన బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తన మాట నిలుపుకొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అనాథలైన వారి ముగ్గురు పిల్లలకు చేయూతనందించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటకు చెందిన నేత కార్మిక దంపతులు బైరి అమర్-స్రవంతి ఆర్థిక ఇబ్బందులతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబ సభ్యులను కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. తల్లిదండ్రులు కోల్పోయి అనాథలైన ముగ్గురు చిన్నారులకు అధైర్యపడవద్దని, ఏ ఆపదొచ్చినా అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. ₹2లక్షలు చొప్పున పార్టీ ఫండ్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని హామీనిచ్చారు. ఆయన హామీ ఇచ్చినట్టుగానే సోమవారం ముగ్గురు చిన్నారుల పేరిట ₹2లక్షల చొప్పున పార్టీ ఫండ్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో నాయకులు అమర్ నివాసానికి వెళ్లి సంబంధిత ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను చిన్నారులకు అందజేశారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్డర్లు లేక నేతన్నలు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో ఆకలిచావులకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేత కార్మిక కుటుంబానికి చెందిన దంపతుల ఆత్మహత్య ఘటన బాధాకరమన్నారు. ఇలాంటి ఆత్మహత్యలు పునరావృతం కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, పెండింగ్‌లో పెట్టిన వస్త్ర పరిశ్రమ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేత కార్మికులు తమ పిల్లల్ని చూసైనా ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాట ప్రకారం చిన్నారులకు అండగా నిలిచిన రామన్నకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ బైరి నరేశ్ మాట్లాడుతూ, నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోకుండా ప్రభుత్వం వారికి ఉపాధి చూపాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిడ్డి మాధవి, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, గుండ్లపల్లి పూర్ణచందర్, దిడ్డి రాజు, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేసే వారికే అవకాశం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): పార్టీ, ప్రజల కోసం నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పెద్దపల్లి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. స్వలాభం కోసం వచ్చిన వారే పార్టీని విడిచి వెళ్లారని, నిఖార్సైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలంతా పార్టీలోనే ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్‌లో లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని, ఉద్యమం నుంచి పుట్టిన పార్టీ అని గుర్తు చేశారు. రానున్న రోజులు బీఆర్‌ఎస్ పార్టీవేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో గద్దెనెక్కిందని, ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలను గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యమంత్రి స్థాయిలో రేవంత్‌రెడ్డి భాష, ప్రవర్తన, పద్ధతిని ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు వాళ్లే బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో దోపిడీ పరిపాలన నడుస్తోందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు తరిమి కొట్టే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ జడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీ బాలాజీరావు, బండారి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పెద్దపల్లి పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.